కల్లాలుగా రహదారులు

- రోడ్లపైనే ధాన్యం ఆరోబోస్తున్న రైతులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు



రాజాపూర్ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఆరబోసిన ధాన్యం.

రాజాపూర్: మండల పరిధిలో రహదారులపైనే పంటలనూర్పిళ్లు చేయడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ధాన్యం ఆరబెట్టడం దగ్గర నుంచి.. తూర్పారా బట్టే వరకు జాతీయ రహదారిపై, సర్వీస్‌రోడ్లపైనే చేపడుతుండడంతో వాహదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంతో పాటు, రంగారెడ్డిగూడ బస్టాప్‌వద్ద పంటల సీజన్‌లలో చాలామంది రైతులు రహదారులనే కల్లాలుగా వాడుతున్నారు. గత సంవత్సరం వరిధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టడంతో గుర్తుతెలియని వాహనం ఢీకొని మండల కేంద్రానికి చెందిన మహిళ కళ్ల ఎదుటే మృతి చెందిన ఘటన చోటు చేసుకున్న విషయం విధితమే. అంతేకాకుండా రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టడంతో పాటు తూర్పారబడుతుండడంతో దుమ్మూ, ధూళి ఇళ్లలోకి వస్తోందని సమీప నివాసాల ప్రజలు పేర్కొంటున్నారు. జాతీయ రహదారిని మెయిన్‌టెన్ చేసే సిబ్బంది సిబ్బంది రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని అంటున్నారు.

తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి



రహదారులపై ధాన్యం ఆరబోయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత సంవత్సరం మండల కేంద్రానికి చెందిన కుర్వలక్ష్మమ్మ ధాన్యం ఆరబోసి సాయంత్రం కుప్పవేస్తుండగా మా కళ్లముందే వాహనం ఢీకొని వెళ్లడంతో అక్కడి కక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఇలా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– వెంకట్‌రాజు, రాజాపూర్

రోడ్లపై ఆరబోయొద్దని చెబుతున్నాం

జాతీయ రహదారిపై, సర్వీస్ రోడ్లపై ధాన్యం ఆరబోయకూడదని, ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులకు, గ్రామాల ప్రజలకు చెబుతూనే ఉన్నాం. పొలాలవద్ద కల్లాలు ఏర్పాటు చేసుకుని అక్కడే నూర్పిళ్లు చేయాలని అవగాహన కల్పిస్తున్నాం. జాతీయ రహదారి మెయిన్‌టెయిన్ చేసేవారికి కూడా సమస్యపై చెబుతూనే ఉన్నాం.

– వెంకట్‌రెడ్డి ఎస్‌ఐ రాజాపూర్ మండలం

క్లుప్తంగా

మిడ్జిల్‌లో పోలీసుల కవాతు



మిడ్జిల్: అసెంబ్లీ ఎన్నికలు సజావుగా సాగేందుకు, ప్రజల్లో భరోసా కల్పించడం కోసం శనివారం మండల కేంద్రంలో ప్రత్యేక పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు సూచించారు. ఆర్‌ఎస్‌ఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల బీఎస్పీ అభ్యర్థిగా శివకుమార్



శివకుమార్

జడ్చర్ల టౌన్: ఎన్నికల్లో జడ్చర్ల నియోజకవర్గం నుంచి బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా వుల్కుందకర్ శివకుమార్‌ను ఖరారు చేశారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం శనివారం పోటీచేసే అభ్యర్థుల జాబితా విడుదల చేసింది. బాలానగర్ మండలం చిన్నరేవల్లికి చెందిన శివకుమార్ కటిక సామాజిక వర్గానికి చెందినవారు.

తెలంగాణ ఉద్యమంలో జేఏసీలో మండలంలో కీలక పాత్ర పోషించారు. 2018లో జడ్చర్ల నుంచి తెలంగాణ ఇంటి పార్టీ తరఫున పోటీ చేశారు. క్యాబ్‌అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగానూ ఆయన పనిచేశారు.

గోశాలకు విరాళం

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన శ్రీ లక్ష్మి గోశాల పోషణార్థం గ్రామానికి చెందిన గోవిందమ్మ శనివారం విరాళం ప్రకటించారు. నిర్వాహకులకు రూ. 10 వేలను అందజే శారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



మహబూబ్‌నగర్ క్రీడలు: ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహిస్తామని లిటిల్ స్కాలర్స్ స్కూల్ డైరెక్టర్ జలజం విదూషిరాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ పాఠశాలలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తమ తండ్రి జలజం సత్యనారాయణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ముందుండేవారన్నారు. ఈ నేపథ్యంలోనే పాఠశాల స్థాయిలో క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 6 నుంచి 11 వరకు ఎండీసీఏ మైదానంలో '2వ జలజం సత్యనారాయణ ఇంటర్ స్కూల్ టీ–10 క్రికెట్ ట్రోఫీ' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రికెట్ టోర్నీ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్, పీఈటీలు వినోద్‌కుమార్, అరుణ్‌కుమార్, నాసర్, వెంకటయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

మహమ్మదాబాద్: ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన మండలపరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మాపూర్‌కి చెందిన కావలి వెంకటేశ్ తన భార్య సరిత పిల్లలతో కలిసి కుల్కచర్ల మండలం కల్మన్‌కాల్వకు బయలుదేరాడు. అదే సమయంలో అడవి వెంకటాపూర్‌కి చెందిన ఎక్కలి లక్ష్మణ్ తన స్నేహితుడితో కలిసి మహమ్మదాబాద్ వైపు వస్తున్నాడు. ధర్మాపూర్ అటవీ ప్రాంతంలో లోతు వాగు దగ్గరికి రాగానే ఎదురెదురుగా ఇద్దరి బైక్‌లు ఢీకొన్నాయి. ఘటనలో సరిత కాలు విరగింది. లక్ష్మణ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

బోయ సంఘం నూతన కమిటీ ఎన్నిక



నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లిలో శనివారం బోయ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా చిన్న నర్సింహులు, ఉపాధ్యక్షుడిగా గామిలే పవన్‌కుమార్, కోశాధికారిగా గుజ్జల నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా బద్రి తిమ్మప్ప, బాల్‌నర్సింహులు ఎన్నికయ్యారు. అనంతరం కొత్త సభ్యులకు ప్రతిజ్ఞ చేయించి శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు తిర్మలయ్య, నీరజ్, యాదయ్య, హన్మంతు, ఎల్లప్ప, ఆశప్ప పాల్గొన్నారు.

ప్రచార వాహనాలకు అనుమతి తప్పనిసరి



మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న కుందన్‌యాదవ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎన్నికల ప్రచారంలో ఉపయోగించే వాహనాలతోపాటు, ఎన్నికలలో ఉపయోగించే అన్ని వాహనాలకు తప్పనిసరిగా కలెక్టర్, జిల్లా రిటర్నింగ్ అధికారి జారీ చేసిన అనుమతి పత్రం తప్పనిసరిగా ఉంచుకోవాలని మహబూబ్‌నగర్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు కుందన్‌యాదవ్ తెలిపారు. శనివారం ఆయన మహబూబ్‌నగర్‌లో ఓ పార్టీకి చెందిన ప్రచార వాహనం ఆపి అనుమతి పత్రాలు, డ్రైవర్ లైసెన్స్ తదితర వివరాలను పరిశీలించారు. అనుమతి పత్రాలు లేకుండా వాహనాలు తిరిగితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ నిర్వహణకు సంబంధించి జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు తేజస్వితో కలిసి సమీక్షించిన తర్వాత, ఐడీఓసీలోనే ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెయిడ్ న్యూస్ పరిశీలన, రాజకీయ ప్రకటనలకు జారీ చేసే అనుమతి, సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా స్కానింగ్ తదితర విషయాలను ఎంసీఎంసీ, సోషల్ మీడియా నోడల్ అధికారి, డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీ–విజిల్, ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూంను సందర్శించి ఫిర్యాదులు, సువిధ అనుమతులు తదితర వివరాలను ఇన్‌చార్జ్ సత్యనారాయణ ద్వారా ఆరాతీశారు.

ప్రతి సామాజిక వర్గానికి సముచితస్థానం



మాట్లాడుతున్న యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రతి సామాజిక వర్గానికి సముచితస్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం కురుమ యాదవుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. యెన్నం మాట్లాడుతూ కురుమ యాదవులు శ్రామిక, కష్టజీవులని కాంగ్రెస్ ప్రభుత్వంలో వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించే దిశగా అడుగులు వేస్తామని అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, సిరాజ్ ఖాద్రీ, రాములుయాదవ్, బురుజు సుధాకర్‌రెడ్డి, అమరేందర్‌రాజు, రాధా అమర్, తదితరులు పాల్గొన్నారు. పలు వార్డులకు చెందిన వారు యెన్నం సమక్షంలో పార్టీలో చేరారు.

బీసీ నినాదంలో కొత్తనాటకం

బీసీ నినాదంతో నియోజకవర్గంలో కొత్త నాటకాన్ని తెరలేపుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎన్‌పీ వెంకటేశ్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ఎంతమంది బీసీలపై అక్రమ కేసులు పెట్టారో అందరికీ తెలుసన్నారు. మంత్రికి ఓట్లు వేయాలని మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ అడుగుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రాధా అమర్ నియోజకవర్గంలో ప్రశించే వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు.

ఆదరించండి మరింత అభివృద్ధి చేసుకుందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి

చిన్నచింతకుంట: బీఆర్‌ఎస్‌ను ఆదరించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసుకుందామని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం బండ్రపల్లి, లాల్‌కోట, పల్లమరి, పర్దిపూరం, గోప్యానాయక్ తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ తెలంగాణ అభివృద్ధికి ఎంతో కృషి చేశాడన్నారు. కేసీఆర్ ఆశీర్వాదంతో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని మరోమారు గెలిపించాలని కోరారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ వేదిక పనుల పరిశీలన

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఈ నెల 6 న జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ వేదిక పనులను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. సభా ప్రాంగణం, సభా వేదికతో పాటు హెలీప్యాడ్ పనులను, నియోజకవర్గంలోని గ్రామాల నుంచి వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, కరణంరాజు, వెంకటేశ్, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలేని కాళేశ్వరం ప్రాజెక్టు



మాట్లాడుతున్న అన్షుమాన్

స్టేషన్ మహబూబ్‌నగర్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కేసీఆర్ అవినీతికి పాల్పడ్డారని ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జ్ అన్షుమాన్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం నిర్మాణంలో నాసిరకమైన మెటిరీయల్‌ను వినియోగించారని.. రీడిజైన్‌లో కూడా లోపాలున్నట్లు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తమ నివేదికలో పేర్కొన్నట్లు వివరించారు. రూ. లక్షల కోట్ల దోపిడీ చేశారని ఆరోపించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి పాలమూరు–రంగారెడ్డి తర్వాత పనులు ప్రారంభించిన కాళేశ్వరాన్ని ఆదరాబాదరాగా పూర్తిచేశారని.. ప్రభుత్వ నిర్లక్ష్యం ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. మరో అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్ కాళేశ్వరం అవినీతిపై బీజేపీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అజ్మత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేటలోని పార్టీ కార్యాలయం వద్ద శనివారం బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ రామన్‌గౌడ్, వేముల ఎంపీటీసీ యాట సత్యనారాయణ, అడ్డాకుల సర్పంచ్ భర్త భీమన్నయాదవ్, బనదీశ్వర్, ప్రతాప్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే ఒండ్రు మట్టి, ఇసుక అమ్ముకుని రూ.కోట్లు దోచుకున్నాడని విమర్శించారు. వాగుల్లో నిర్మించిన చెక్‌డ్యాం పనులు నాసిరంగా ఉన్నాయని ఆరోపించారు. శెట్టిశేఖర్, జగదీశ్వర్, శ్రీహరి, నాగిరెడ్డి, తిరుపతయ్య, గోవర్ధన్, కృష్ణయ్య, సంతోషి, రాజశేఖర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటువేయండి



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిడ్జిల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేయాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం కంచన్‌పల్లి, బైరంపల్లి గ్రామాలలో ప్రచారంలో భాగంగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ప్రాజెక్టులు నిర్మించినట్లు వివరించారు. కాంగ్రెస్ వస్తే కష్టాలు తప్పవని గమనించాలని అన్నారు. ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ శశిరేఖ, నాయకులు పాల్గొన్నారు.

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీకి గ్యారెంటీలేదని.. కర్ణాటక ప్రభుత్వం ఎలా ఉందో ప్రజలకు అర్థమైందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం గురుకుంటలో టీడీపీకి చెందిన జిల్లా, మండల నేతలు బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. కేసీఆర్ మరోసారి సీఎం అవుతారని అన్నారు. మండల అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, వైస్ చైర్మన్ చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికుడిని అవకాశమివ్వండి

రాజాపూర్: 'స్థానికుడిని.. మీ పక్క గ్రామస్తుడిని.. ఒకసారి అవకాశమివ్వండి' అని శనివారం ఈద్గాన్‌పల్లిలో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి బాలానగర్ మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ రఘువీర్‌రెడ్డితో పాటు రెండువందలకు వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా అనిరుధ్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా గ్రామానికి ఉన్న ప్రధాన సమస్య దుందుభీవాగుపై వంతెనను అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్లురవి నిర్మించి కష్టాలు తీర్చారని అన్నారు. రఘువీర్‌రెడ్డి పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. మండల అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, నరహరి, గోవర్ధన్‌రెడ్డి, డిప్యూటీ సర్పంచ్ వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

నవాబుపేట: కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి శనివారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి, పీసీసీ అధికారప్రతినిధి జహీర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాసుయాదవ్, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రచారం



దేవరకద్ర: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో శనివారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులుఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని మూడోసారి గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, గోపాల్, వెంకటేశ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బతుకులు మారుతాయి



గండేడ్/మహమ్మదాబాద్: బీఆర్‌ఎస్‌ను తరిమికొట్టాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు కమతం విష్ణువర్ధన్‌రెడ్డి, గండేడ్, మహమ్మదాబాద్ మండలాల అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, కేఎం నారాయణ అన్నారు. శనివారం మహమ్మదాబాద్, గండేడ్, జిన్నారం తండా తదితర చోట్ల ప్రచారం నిర్వహించారు. గ్యారెంటీ పథకాలతో బతుకులు మారుతాయన్నారు. మాజీ ఎంపీపీ శాంతిరంగ్యా, జక్లపల్లి ఎంపీటీసీ వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి



గండేడ్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని మండలాధ్యక్షుడు ప్రభునాయక్ పేర్కొన్నారు. శనివారం రంగారెడ్డిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రం చేపట్టిన సంక్షేమ పథకాలు పేదల అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడుతున్నాయని అన్నారు. మారుతి కిరణ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఓబీసీ మండల మోర్చా అధ్యక్షుడు బాలయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి బాల్‌రాజ్, సోషల్ మీడియా కన్వీనర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

దేవరకద్ర రూరల్: కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందిన ఘటన శనివారం నాగారంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాశీపురం మైబు గొర్రె పిల్లలకు కంచె ఏర్పాటు చేసి మిగతా గొర్రెలను మేత కోసం అడవికి తీసుకెళ్లాడు. అదే సమయంలో కంచెలో ఉన్న గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేశాయి. ఘటనలో 12 గొర్రె పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి. చనిపోయిన వాటి విలువ రూ. 70 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని మైబు కోరారు.

విజయాన్ని ఎవరూ ఆపలేరు

హన్వాడ: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని ఎమ్మెల్యే అభ్యర్థి మిథున్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం రామన్నపల్లి, వేపూర్, లింగన్నపల్లి, చిన్నదర్పల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. లింగన్నపల్లిలో పాఠశాల విద్యార్థులతో కలిసి మాట్లాడుతూ మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. గ్రామంలో పలువురి కూలిన ఇళ్లను పరిశీలించి.. బీజేపీ ప్రభుత్వం వస్తుందని ఇళ్లు ఇస్తామని భరోసా ఇచ్చారు. జిల్లా కార్యదర్శి కొండాబుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి

వెలుగులు చిమ్మని వీధి లైట్లు

హన్వాడ: మండలకేంద్రంలోని పలుకాలనీల్లో వీధిలైట్లు వెలగక అంధకారం అలుముకుంది. ఈ విషయంపై సంబంధిత అధికారులకు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారు. మేజర్ గ్రామంలో వీధిలైట్లు నాసిరకంగా అమర్చడంతో మూడునాళ్ల ముచ్చటగానే మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అమర్చిన వారం రోజుల్లోనే లైట్లు వెలగడం ఆగిపోతోందని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మండలకేంద్రంలోని శివారు కాలనీల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో ఆప్రాంతాలు నిర్మానుష్యంగా మారి భయాందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఆ ప్రాంతం చీకటిమయం కావడంతో ఇళ్ల సమీపానికి విషపురుగులు సంచరిస్తుండడంతో భయబ్రాంతులకు గురవుతున్నామని చెబుతున్నారు. విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్తే తనకు వేసిన వాటికి బిల్లులే రావడం లేదు.. ఖజానా ఖాళీ అయ్యిందని పేర్కొనట్లు వివరించారు. నాసిరకం వీధిలైట్లు అమర్చడంతో పాటు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని విమర్శలు చేస్తున్నారు. అదే విధంగా పంచాయతీ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

చీటికీ.. మాటికీ విద్యుత్ సమస్యలు...



హన్వాడలో అలుముకున్న చీకట్లు

ఇదిలా ఉండగా మండలకేంద్రంలో చీటికీ.. మాటికీ విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటుచేసుకుంటోంది. ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద సమస్యలు తలెత్తడంతో మరమ్మతుల పేరిట గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. దీంతో ప్రధానంగా వ్యాపారాలు చేసే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకస్మాత్తుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో టీవీలు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లతో పాటు వ్యాపార సముదాయాల్లోని ఎలక్ట్రానిక్ వస్తువులు పాడవుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

450 కొత్త బల్బులు వేశాం

హన్వాడలో మొత్తం 600 వరకు వీధిలైట్లు ఉంటాయి. ఇప్పటివరకు 450బల్బుల వరకు కొత్తవి అమర్చాం. అక్కడక్కడా వెలగని వీధి లైట్లు మళ్లీ కొత్తవి వేస్తున్నాం. నాణ్యతలో ఎలాంటి సమస్య లేదు. ప్రధానరహదారి గుండా ఒక్కో బల్బు రూ.2వేలపైగా విలువైనవి అమర్చాం. గల్లీల్లో వీధిలైట్లు వెలగని చోట సమస్యను సత్వరమే పరిష్కరిస్తాం.

–సర్పంచ్, రేవతి

ఖజానాలో డబ్బుల్లేవ్

హన్వాడలో మొత్తం 14మంది పంచాయతీ సిబ్బంది ఉన్నారు. వాళ్లకే జీతాలివ్వలేని పరిస్థితి ఉంది. ఎం చేయాలో అర్థం కావడం లేదు. అక్కడక్కడ వీధిలైట్లు వెలగనిది నిజమే త్వరలో మరమ్మతు చేయిస్తాం... ఎలక్షన్ కోడ్ ఉంది. తప్పకుండా సమస్యను పరిష్కరిస్తాం.

– వెంకట్‌రెడ్డి, ఈఓఆర్‌డీ

బీఆర్‌ఎస్‌లోకి ఇబ్రహీం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్‌కు చెందిన ప్రముఖ మైనార్టీ నేత ఇబ్రహీం బీఆర్‌ఎస్‌లో చేరారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సొంత గూటికి వచ్చినట్లు ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రం న్యూటౌన్‌లోబీజేపీ సోషల్ మీడియాకు చెందిన యువకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.